క్లుప్తంగా

మాజీ ఎంపీ వివేక్‌ను కలిసిన నాయకులు



ధర్మారం: కమ్మరిఖాన్‌పేటలో ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సహకరించాలని సర్పంచ్ గుజ్జుల రమాదేవి, మాజీ సర్పంచ్ గుడిమెనుక మోహన్, తండా కే సర్పంచ్ నరేష్, గౌడ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడె సూర్యనారాయణ, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి బాలయ్య, ఉపాధ్యక్షుడు నేరెళ్ల మహేశ్, నాయకులున్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన గంగుల పోశాలు వైద్య ఖర్చుల కోసం సింగరేణి అధికారులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు కలిసి సేకరించిన రూ.లక్షను మంగళవారం కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లి, బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. పోశాలు నాలుగు రోజుల క్రితం సెంటనరీకాలనీ తెలంగాణ చౌరస్తా వద్ద ఇసుక లారీ ఢీకొని, తీవ్రంగా గాయపడ్డాడు. కార్యక్రమంలో సంపత్, ఓదెలు, సది, సదానందం, తిరుపతి, శ్రీకాంత్ తదితరులున్నారు.

హనుమాన్ స్వాములకు భిక్ష

ఎలిగేడు: మండల కేంద్రంలోని రామాలయంలో హనుమాన్ దీక్షాపరులకు మంగళవారం భిక్ష ఏర్పాటు చేశారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. హనుమాన్ మాలధారుల తోపాటు భక్తులు హాజరయ్యారు.

శివాలయంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయం ఆవరణలో ఉన్న హనుమాన్ విగ్రహానికి హనుమాన్ దీక్షాపరులు, భక్తులు మంగళవారం సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునికి రుద్రాభిషేకం చేశారు.

27న సుల్తానాబాద్‌కు సీపీఐ పోరుయాత్ర

సుల్తానాబాద్: ఈ నెల 27వ తేదీన సీపీఐ పోరుయాత్ర సుల్తానాబాద్‌కు చేరుతుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో బహిరంగ సభ ఉంటుందని, ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు తరలిరావాలని కోరారు.

టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఎన్నిక



సుల్తానాబాద్: టూ వీలర్ మెకానిక్ యూనియన్ సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడిగా గుండా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గాయం మురళి, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ మధుకర్, కార్యదర్శులుగా పొన్నం సంపత్ కుమార్, బొడ్డుపల్లి సురేశ్, కోశాధికారిగా దాసరి సురేష్, గౌరవ అధ్యక్షులుగా మనోహర్, మిట్టపెల్లి రాంనారాయణలను ఎన్నుకున్నారు.

ఘనంగా తిరునక్షత్రోత్సవం

ఎలిగేడు: ముప్పిరితోట గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరునక్షత్రోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు బాలరాజుపల్లె, పెద్దాపూర్, తెలుకుంట గ్రామాల్లో నర్సరీలను డీఎల్‌పీవో వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఎంపీవో కిరణ్ తదితరులున్నారు.

డీజే, మైక్ సెట్ వితరణ

కాల్వశ్రీరాంపూర్: వెన్నంపల్లి పెద్దమ్మ తల్లి ఆలయానికి ఏగోళపు కుమార్ ట్రస్ట్ చైర్మన్ సదయ్య గౌడ్ మంగళవారం డీజే, మైక్ సెట్ వితరణ చేశారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులున్నారు.

ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై నిర్లక్ష్యం

- రామగుండంలో మరమ్మతుకు నోచుకోని పరికరాలు
- సులువుగా కదలకపోడంతో వాకర్ల ఇబ్బందులు
- మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు



దుర్గానగర్‌లోని ఓపెన్ జిమ్‌కు వచ్చిన స్థానికులు

కోల్‌సిటీ: ప్రజలు మానసికోల్లాసం, చక్కటి ఆరోగ్యం, శారీరక దృఢత్వంతో ఉండాలన్న లక్ష్యంతో రామగుండం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్(అవుట్ డోర్ జిమ్)లపై పాలకులు, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రారంభించి, రెండున్నరేళ్లయినా నిర్వహణను పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేక జిమ్‌లకు వస్తున్న వారే స్వచ్ఛందంగా మరమ్మతు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది.

రూ.50 లక్షలతో నాలుగు జిమ్‌ల ఏర్పాటు

నగరపాలక సంస్థలో పట్టణ ప్రగతి నిధులు రూ.50 లక్షలతో 2020 డిసెంబర్‌లో నాలుగు ఓపెన్ జిమ్‌లు నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో, ప్రభుత్వ శాతవాహన పీజీ కాలేజీ ఆవరణలో, దుర్గానగర్ పార్క్ ఎదుట, గౌతమినగర్ పార్క్ ఎదుట ఏర్పాటు చేశారు. ఎయిర్ వాకర్, పుష్‌చైర్, ఎయిర్ స్వింగ్, షోల్డర్ వీల్, లెగ్‌ప్రెస్, పుల్‌చైర్, స్టాండింగ్ ట్విస్టర్, డబుల్ క్రాస్ వాకర్, ఎల్లిప్టికర్ ఎక్సర్‌సైజ్, లెగ్‌లిఫ్ట్, సిట్టింగ్ ట్విస్టర్ తదితర పరికరాలకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టకపోవడంతో, వాటి నుంచి శబ్దాలు వస్తున్నాయి. కొన్ని పరికరాలు బిగుసుకుపోవడంతో పని చేయక నిరుపయోగంగా మారాయి.

పెరిగిన ఆదరణ..

ఓపెన్ జిమ్‌ల పట్ల యువత, చిన్నారులు, మహిళలు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఆసక్తి కనబరుస్తున్నారు. సీనియర్ సిటిజన్లు, మహిళలు క్రమం తప్పకుండా వచ్చి, వ్యాయామం చేస్తున్నారు. కానీ చాలా పరికరాలు కదలకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్..

గోదావరిఖని పీజీ కాలేజీ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరించలేదు. దీంతో అది అధ్వానంగా మారింది. ట్రాక్‌పై బండ రాళ్లు పేరుకుపోవడంతో వాకర్లు నడవడానికి నానాతంటాలు పడుతున్నారు. అధికారులకు, పాలకులకు చెప్పినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల దగ్గర మహిళలు, పురుషులకు వేర్వేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షణ లేదు



ఓపెన్ జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ లేదు. పరికరాలకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టకపోవడంతో సులువుగా కదలడం లేదు. దీంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరికరాలకు మరమ్మతు చేయించాలి. అవసరమైతే కాంట్రాక్టర్లకు మెయింటెనెన్స్ బాధ్యత ఇవ్వాలి.

– బుచ్చిరెడ్డి, దుర్గానగర్

నేనే మరమ్మతు చేస్తున్న



మాది ప్రశాంత్‌నగర్. పీజీ కాలేజీ మైదానంలో ప్రతిరోజూ వాకింగ్ చేసి, జిమ్‌లో వ్యాయామం చేస్తుంటా. అధికారులు పరికరాలను పట్టించుకోకపోడంతో నేనే వారం వారం మరమ్మతు చేస్తున్న. వాటికి గ్రీజు పూయడం, లూజ్‌గా ఉండే నట్లు, స్క్రూలకు వాచర్లు వేసి, టైట్ చేస్తున్న.

– దాసరి రాములు, ఆర్టీసీ డ్రైవర్

ఊరూరా బీఆర్ఎస్ జెండావిష్కరణ



ధర్మారంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

ధర్మారం: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆ పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ధర్మపురిలో నిర్వహించిన ప్లీనరీకి తరలివెళ్లారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రామారావు, ఎగ్గెల స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పెద్దపల్లిలో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, పీఏసీఎస్ చైర్మన్లు రామచంద్రారెడ్డి, పురుషోత్తం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులున్నారు.

ఎలిగేడు: మండలంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి తదితరులున్నారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులున్నారు.

పెద్దపల్లిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య కూడళ్లలో బీఆర్ఎస్ జెండాలను ఆ పార్టీ ఎగురవేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు ఆఫీసు ఆవరణలో జరిగిన ప్లీనరీకి తరలివెళ్లారు.

ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె, గుంపుల, ఓదెల, ఇందుర్తి, బాయమ్మపల్లె గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కావటి రాజు, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పోలోజు రమేశ్, డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలో మంగళవారం బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు పెద్దపల్లిలో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి తరలివెళ్లారు. జూలపల్లి నుంచి ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ నర్సింహయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, నాయకులు, తెలుకుంట నుంచి జెడ్పీటీసీ సభ్యుడు బొద్దుల లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లారు.

కమాన్‌పూర్: మంథనిలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్లీనరీకి కమాన్‌పూర్, రామగిరి మండలాల నుంచి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించి, బైక్ ర్యాలీగా మంథనికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై తప్పుడు ప్రచారం



ఠాణాలో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కమాన్‌పూర్, రామగిరి మండలాల అధ్యక్షులు వైనాల రాజు, తోట చంద్రయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కమాన్‌పూర్, రామగిరి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో శ్రీధర్‌బాబు గెలుపు ఖాయమని తెలుసుకొని, కొంతమంది సోషల్ మీడియాలో ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇంకొందరు అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్నారని తెలిపారు. వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శేవ్వ శంకరయ్య, నాయకులు రంగు సత్యనారాయణ, భూంపెల్లి రాజయ్య, బర్ల శ్రీనివాస్, కాటం సత్యం, ఉడత శంకర్, తులసీరాం గౌడ్, పిడుగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘జూలపల్లి’లో ముగిసిన కంటివైద్య శిబిరాలు

జూలపల్లి: కంటి వైద్య శిబిరాలు జూలపల్లి మండలంలో జనవరి 19న ప్రారంభించగా ఈ నెల 24తో ముగిశాయి. మండల వ్యాప్తంగా 16,096 మందికి కంటి పరీక్షలు చేసి, 2,555 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశారు. కంటి సమస్యలున్న 1,844 మందికి అవసరమైన అద్దాలను అందించేందుకు సిఫారసు చేసి, 1,370 మందికి ఇచ్చారు. మరో 474 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. వైద్య పరీక్షలను మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డితోపాటు ఇద్దరు వైద్యాధికారులు, ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఎంపీవో కిరణ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు విజయవంతంగా పూర్తి చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. దుకాణదారులు చెత్తతోపాటు వ్యర్థ పదార్థాలను రహదారి వెంట పడేస్తున్నారని ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం చెత్త వేయొద్దంటూ మున్సిపల్ సిబ్బందితో పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల వాహనదారులు, స్థానిక ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడతారని, అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. బయట చెత్త వేయడం మానుకోవాలని, స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినవారికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు: సుల్తాన్‌పూర్‌లో శ్రీరేణుక ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఎల్లమ్మతల్లి లగ్నపట్నం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉపసర్పంచ్ ఆకుల హరీశ్‌గౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు పల్లె వీరస్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు ఆకుల తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ కొండ తిరుపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో అంటు మొక్కలు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ శివారు కేవీకేలో మామిడి, నిమ్మ, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్, పూల అంటు మొక్కలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త శ్రీనివాస్ తెలిపారు. 99490 74932 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



జూలపల్లిలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

కమాన్‌పూర్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కమాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియాను నిర్మూలించాలంటే ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంట్లో దోమ తెరలు వాడాలంటూ వైద్య సిబ్బంది నినాదాలు చేశారు.

జూలపల్లి: మలేరియా ప్రబలకుండా ఉండాలంటే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా నివారణ మాసాన్ని పురస్కరించుకొని ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వసంత, ఫార్మసిస్టు రమేశ్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

రామగుండం: రేషన్ షాపుల్లో 12 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ఆయా సంఘాల నాయకులు అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఆధారంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. తెలుపు రేషన్‌కార్డు ద్వారా ఇస్తున్న ఐదు కేజీల బియ్యం పూర్తిగా ముక్కిపోయి వస్తున్నాయని, సదరు బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి, పొరుగు రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, నాయకులు మార్త రాములు, గొల్లపల్లి చంద్రయ్య, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, మార్త రాధ, కల్పన, దేవన్న, ఉడుత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘దళితుడిననే సమాచారం ఇవ్వడం లేదు’



మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

జూలపల్లి: తాను దళితుడిననే బీఆర్ఎస్ సమావేశాలకు, ప్లీనరీకి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం జూలపల్లిలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ బాల్క సుమన్, నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆశీస్సులతో జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వచ్చిందన్నారు. తనను అవమానిస్తున్న ఎమ్మెల్యేపై మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

దళితులను అవమానిస్తే ఊరుకోబోం..

ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తీరు దళితులను అవమానపరిచేలా ఉందని, వారిని పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టడమే ఇందుకు నిదర్శనమని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు మామిడిపెల్లి చంద్రశేఖర్ అన్నారు. జూలపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, కల్లెపల్లె మధు, రాయమల్లు, పిట్టల లచ్చయ్య, సాయి, రాజు ఉన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్, సుగ్లాంపల్లిల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. అకాల వర్షాలకు రైతులు వేసిన పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సూచన మేరకు వ్యవసాయ అధికారులు గ్రామగ్రామాన పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేస్తున్నారని, అందరికీ పరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తారని, అన్నదాతలు అధైర్య పడవద్దని సూచించారు. కార్యక్రమంలో సింగల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, కార్యదర్శి బూర్గు సంతోష్ కుమార్, డైరెక్టర్లు గోపాల్, రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఓదెల: రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పొత్కపల్లి, లంబాడితండాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాల్లో అన్నదాతలకు కనీస సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజు, ఏపీఎం లతామంగేశ్వరి, సర్పంచ్‌లు ఓదెలు, మణెమ్మ, ఉపసర్పంచ్ నిమ్మ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వేదపండితులు

మంథని: పట్టణంలోని శ్రీశిలేశ్వర సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమం జరిపారు.

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతిని విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన హిందూ ధర్మ శాస్త్రం, ఇతర శాస్త్రాలను బోధించారన్నారు. కుల పెద్దలు చిలుమోజు వీరాచారి, జూపాక కుమారస్వామి, పొలాస సత్యనారాయణ, దాసోహం వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్ సింగ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ భీమునిపట్నంకు చెందిన సార్ల అంజయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. వైద్యసేవల బిల్లు తగ్గించాలని సూచించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

పాఠశాలల వార్షికోత్సవం



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాల, క్రీసెంట్, వేదవ్యాస హైస్కూళ్లలో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. అతిథిగా టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేశ్ హాజరై, మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎస్సై రాజవర్ధన్, సర్పంచ్‌లు లావణ్య, సంగీత, రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ నిర్మల, హెచ్ఎంలు సమ్మయ్య, ఉమామహేశ్వర్, నసీర్, టీచర్లున్నారు.

శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి సేవలో ‘కోలేటి’



గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీ కాశీ శివలింగ సహిత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారిని మంగళవారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి-పోషం దంపతులు దర్శించుకున్నారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధనోత్సవాల్లో భాగంగా పూజలు చేశారు.

ఆశ్రమం చిన్నారులకు దుస్తుల అందజేత



రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులకు సదాశయ ఫౌండేషన్ బాధ్యుడు లగిశెట్టి చంద్రమౌళి మంగళవారం కొత్త దుస్తులు అందించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, శ్రావణ్‌కుమార్, నూక రమేశ్, సాన రామకృష్ణారెడ్డి, మారెల్లి రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని స్టూడెంట్ జేఏసీ జిల్లా కో-కన్వీనర్ సూర శ్యాం అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పిలుపు మేరకు సుల్తానాబాద్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

లోకపేటలో ‘కంటి వెలుగు’ ప్రారంభం

ఎలిగేడు: లోకపేటలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రభావతి, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా మంగళవారం ప్రారంభించారు. వైద్యులు 159 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 16 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, జీపీ కార్యదర్శి అభిజిత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.